# మబ్బు పరదాలు

"తుఫాను హెచ్చరిక. బంగాళాఖాతములో అల్ప పీడనం ప్రభావం వలన కోస్తా జిల్లాల్లో తుఫాను ప్రభావముంటుంది. తీర ప్రాంతాల్లో గంటకు రెండొందల కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తూ కుండపోత వర్షాలు కురియవచ్చు...."

ఆకాశవాణి వార్తలు వింటున్న గుండెల్లో పిడుగులు రాల్తున్నాయి. ప్రాణాలరచేతిలో కొస్తున్నాయి. -

తెగిన ముత్యాలహారం నుండి నేలరాలి చెల్లాచెదరైన ముత్యాల్లా పరుగులు తీస్తున్నారు తీరప్రాంత ప్రజలు, ఎత్తైన ప్రదేశాలను వెదికి పెట్టుకుంటున్నారు. పట్టణ ప్రజల్లో గూడా గుబులు ప్రవేశించింది. కాని కోటేశ్వర్రావు గుండెల్లో మాత్రం పన్నీరు జల్లు కురిసింది. నర్సాపురం తీరంలో గ్యాసులాగా-సంతోషం పెల్లుబుకుతుందతన్లో.

సహాయపునరావాస శాఖలో పెద్ద అధికారతడు.

ఎప్పుడు తుఫాను వచ్చిన

అప్పుడు ఆదాయమెచ్చు, అదియెట్లన్నన్

కుప్పలుగ వచ్చు నిధులను.

తిప్పలు లేకుండ దోచి, తినుటయె మేలౌ.

అనేది అతని సిద్ధాంతం. తాను నమ్మిన సిద్ధాంతాన్ని తు.చ. తప్పకుండా పాటించడములో అతనికతడే సాటి

నాలుగు వేళ్లు నోట్లో కెళ్లడానికి నానాగడ్డి కరుస్తున్న

రోజుల్లో ఉద్యోగం దొరికిందతనికి అంచెలంచెలుగా ప్రమోష నొచ్చి అధికారయాడు, తుఫానులు, ఉప్పెనల పుణ్యమాని హైద్రాబాదులో అరంతస్తులమేడ. భార్య ఒంటినిండా బంగారు నగలు, బాంకు బాలెన్సు లక్షల్లో సమకూరాయి. ఈసారి వచ్చే వరద ఆదాయంతో ఏంచెయ్యాలనే ఆలోచనతో సతమతమై పోతుంటే "రాబోయే ప్రమాదాన్నెదుర్కొనేందుకు ప్రజలనాదుకు నేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండా' లనే ఆదేశ మం దింది. ఇందు నిమిత్తం నిధుల కొరత ఉండదని గూడా హెచ్చ రించారు.

అధికారులంతా తీర ప్రాంతాలకు తరలి వెళ్లారు. కలియుగ మానవాళి పాప భీతి. దైవభీతిని మరిచిందనే కోపంతో ప్రకృతి వేయి వాల్కలతో పడగెత్తింది. సముద్ర గర్భంలో అల్లకల్లోలం ఉధృతమైంది. పెద్ద పెద్ద అలలు పళ్లు పటపటలాడిస్తూ ఊళ్లలోకి పరుగెత్తుకొస్తున్నాయి. క్షణ క్షణం వాటి స్థాయి పెరుగుతుంది- మొదట మూడడుగుల స్థలమడిగి ఆతర్వాత విజృంభించిన వామ నుడిలా:

ఈదురుగాలులు బలంపుంజు కుంటున్నాయి. ఆకాశం రంగు మారింది-కోటేశ్వర్రావు మనస్సులా. చిన్నగా ప్రారంభ మైన వర్షం కుండ పోతగా మారింది. జనమన ఘోషను పట్టించు కోకుండా కురుస్తూనే ఉంది-ఎన్నికైన ఎమ్మెల్యే తన నియోజక వర్గాన్ని మరిచి అభివృద్ధి గురించి గంభీరోపన్యాసం దంచేసినట్టు.

సాయంత్రానికి కల్లా మందువేసవి నిండు వర్షాకాలాన్ని

మించిపోయింది. చల్లని గాలి తెరలు ఎముకల్ని కోరికేస్తున్నాయి. లోతట్టు ప్రాంతాన్ని ముంచేసిన జలాలు ఎత్తు ప్రాంతాల్లో గూడా దాడులు ప్రారంభించాయి. పూరి గుడిసెలు, పాతఇళ్లు, పంటపొలాలు, పశువుల, ప్రాణాలు వరద తీవ్రతకు బలైనాయి.

అంతా చీకటి. రాత్రో, పగలో అర్థంగా కుండా ఉంది. తెల్లారేసరి కల్లా లక్షలాది జనాలు జలప్రళయంలో ఇరుక్కుపోయారు. కరెంటు స్థంబాలు నేల కొరిగాయి. బయటి ప్రపంచము తో సంబంధాలు తెగిపోయి. ప్రజల ఆక్రందనకు ఆకాశం స్పందించి ఇంకా కన్నీరు కారుస్తుంది. వారందరికి అహారం పొట్లాలు, మంచినీటి పాకెట్లు తయారు చేయించే బాధ్యత కోటేశ్వరావుది. లక్షల పొట్లాలు తయారై జీబుల్లో కెక్కుతున్నాయి. అన్నార్తుల అకలికేకలు సముద్రం హోరులో కొట్టుకు పోతున్నాయి అంతా భీభత్సం.

అవిశ్రాంతిగా పులిహోర వండించి పొట్లాలు తయారు చేయిస్తూనే ఉన్నాడు కోటేశ్వరావు. అనూహ్యంగా పరిస్థితి మారిపోయింది. అతని గుడారం చుట్టూ నీరు పొట్లాలు తయారౌతున్న ప్రదేశమంతా జలమమైపోయింది. ఎటూ కదలటానికి వీల్లేదు అరగంటలో మోకాలు మంటికి నీరొచ్చింది. వరద బాధితులకెన్నోసార్లు సహాయమందించి ఎన్నడూ వరదల్లో చిక్కుకోని కోటేశ్వరావు సిబ్బందితో సహా బందీమై పోయాడు. ఎవ కితోచినట్టు వారటూ, ఇటూ, వెళ్లిపోతున్నారు. ఎటుచూచినా నీరే కన్పిస్తుంది. ఏ దారి ఎటుందో తెలీడం లేదు. గాలి, వరదల తాకిడికి గుడారం పిచ్చుక పోయిన పిచ్చుక గూడులా ఎగిరిపోయింది.

సరుకులేవీ కన్పించడము లేదు. పక్క ప్రాంతాల నుండి పరుగెత్తుకొచ్చిన జనాలు గూడా ఉండిపోయారక్కడే-ఎరక్కవచ్చి ఇరుక్కుపోయామనుకుంటూ.

కోటేశ్వర్రావు గుండె గుబుగుబులాడింది. ఏంచెయ్యాలో ఆలోచించుకునేందుకు ఆస్కారమివ్వకుండా కురుస్తుంది వర్షం. పొట్లాలు మోసుకెళ్లేందుకు నిల్చున్న జీబులు చొప్ప బెండ్లలా కొట్టుకు పోతున్నాయి. జీబులో కూచున్న సిబ్బంది బయటికి దుంకి లబోదిబో మంటున్నారు.

చెవులు చిల్లులు పడే శబ్దాలు. అంతా అయోమయం. ఇహ మన నూకలు చెల్లి పోయినట్టేనా?

"ఇంకేం చెయ్యాల్రా దేముడా?"

"దండాలు, శాంతించు గంగమ్మ తల్లీ."

ఏడ్పులు, పెడబొబ్బలు, ప్రకృతి కరాళనృత్యం మనుషుల ప్రాణాలను బలిదీసుకుంటుంది.

ఆకలి దంచేస్తుంది కోటేశ్వర్రావుకు. తన కొరకు ప్రత్యేకంగా తెప్పించుకున్న సరుకులు గూడా సముద్ర గర్భంలో కెళ్లాయి గంటలు గడిచే కొద్ది ఆకలి పేగుల్ని కొరుక్కుతింటుంది. నీటీ మట్టం మరింత పెరిగింది. నరాల్లో నిస్సత్తువ....ఇంకా నిల్చుండే శక్తి లేదు. శక్తియుక్తులన్నీ కాళ్లకు అప్పగించి కొంత దూరం నడవగా ఒక ఇంటి కప్పు కనిపించింది. కాలు మోపేందుకు గూడా సందులేనిది పై కప్పు ఎక్కి నలుగుర్ని బతిమాలి-నాలుగంగుళాల స్థలం సంపాదించాడు. వెన్నుపూసలోంచి వణుకు వచ్చేస్తుంది.

ఎందరికో పునరావాసం కల్పించే శాఖలో పంజేస్తున్న తనకు పునరావాసం కరువైనందుకు దుఃఖం పొంగుకొచ్చింది.

భార్యాపిల్లలేంజేస్తున్నారో? తనకొరకు కళ్లల్లో వత్తులేసుకుని ఎదిరిచూస్తున్నారేమో.... తను ఒక్కరోజు కన్పించకపోతే బెంగతో జ్వరం వాతపడే నానిగాడెలాగున్నాడో! వారిని చూచే భాగ్యముందా!

తాబేలులా ముడుచుకూర్చున్న కోటేశ్వర్రావు మెదడులో నీటి బుడగల్లా వచ్చిపోయే ఆలోచనల కంతంలేకుండా పోయింది. బావురుమన్న కళ్లు వర్షిస్తూనే ఉన్నాయి. కంటినీరు పెదాలకు తాకింది. ఉప్పగా ఉంది.

ఆకలి.... ఆకలి.... పేగులు కొరికే ఆకలి.

కోటీశ్వరుడైన కోటేశ్వర్రావు అంగలార్పులేవీ కుటుంబ సభ్యులకూ, ఆరంతస్తుల మేడకూ, లక్షల బాంకు బాలెన్సుకూ వినబడ్డం లేదు. భగవన్నామ స్మరణ తప్ప ఇంకేమీ లేదు. హనుమాన్ చాలీసా పెదాల మీది కొచ్చింది.

రోజు గడిచిందలాగే. తుంపర చినుకులు సూర్యుణ్ని దాచే సినా అతని ప్రభావాన్ని దాచలేక పోతున్నాయి. నీటి మట్టం తగ్గుతూంది. ఆకాశంలో హెలీకాప్టర్ శబ్దం వినబడింది. కొన్ని వేల కళ్లు ఆశాదీపాలైనాయి. తనుగూడా తల పైకెత్తాడు ఆశగా.

ఆహార పొట్లాలు జారుతున్నాయి. కొన్ని జనం మధ్యలో, మరికొన్ని నేల మీద, నీటి మీద పడ్తున్నాయి. ఆలస్యం అమృతం విషమనే సామెత గుర్తు కొచ్చి బలవంతంగా కప్పుదిగి ఒడు

పుగా నేల మీది కొచ్చాడు. అప్పటికే చాలా మంది పొట్లాల కొరకు పోటీలు పడుతున్నారు.

అరగంట ఉరుకులు పరుగుల తర్వాత ఒక పొట్లం దొరికింది అష్టదరిద్రుడికి నవరత్న ఖచిత సింహాసనం దొరికినట్టనిపించి. పొట్లాం విప్పాడు. గబుక్కున నోట్లో వేసుకున్నాడు. ముక్కిపోయిన బియ్యం, ముగ్గిపోయిన చింత పండుతో తయారు చేసిన పులిహోరని వెంటనే తెలిసిపోయింది. రుచిపచీ ఏమీ లేదు. తుపుక్కున ఉమ్మేసి పొట్లం పూర్తిగా విప్పాడు. జీవం లేని పురుగులు, ఇసుక రేణువులు ఇదిగో మేమున్నా మన్నాయి. కడుపులో దేవినట్టయింది. చుట్టుపక్కల వారు ఇవేవీ చూడకుండా గబగబా తినేస్తున్నారు.

"ఛీఛీ.... ఈముక్కిపోయిన పులిహోర నెట్లా తింటున్నావు తాతా!" అడిగాడు పక్కనున్న ముసలాయన్ని.

నిర్జీవమైన నవ్వు మెరిసింది తాత మొహమ్మీద.

"నువ్వీరోజు మొదటి సారిగా తింటున్నావా నాయనా?"

"దీనికంటె గడ్డి నయం."

"ఇప్పుడది దొరకదుగా!"

'ఐతే మాత్రం ఇలా దిక్కూ దివాణం లేకుండా అన్నమో రామచంద్రా అంటున్న మనకిలాంటి ఆహారం సప్లైచేస్తారా? రెండు మూడ్రోజుల క్రితం పొట్లాల్లోని పులిహోర ఇలాగే ఉందా?' కోపం రోషం నిస్సహాయత ప్రతిధ్వనించాయి.

"ఇంత కంటే అధ్వాన్నంగా ఉంది. నేను నాల్గు రోజుల

నుండి నీళ్లల్లోనే ఉన్నాను. రెండు మూడ్రోజుల క్రితం ఏ దౌర్భాగ్యుడు తయారు చేయించాడో పొట్లాలు.... ఆ పాపాత్ముడికి పుట్టగతులుండవు బాబూ!"

తాత మాటలు పదునెక్కిన ఈటెల్లా నేరుగా గుండెలకు గుచ్చుకుంటున్నాయి.

ఆ రోజుల్లో పులిహోర వడ్డించి పొట్లాలు కట్టించింది తానే, మేలిరకం సరుకులు కొన్నట్టుగా రసీదులు సంపాదించి ముక్కిపోయిన ముతకబియ్యం, గింజలు ఊడ్చిన పప్పులు, మూడు సంవత్సరాల పాతచింత పండు కొన్నది తానే, దాని వల్ల తన బాంకు బాలెన్సు నలభై వేలు పెరిగింది.

"దొంగనా కొడుకులు, ప్రభుత్వమిచ్చిన డబ్బు తినేసి ముదనష్టపు సరుకుల్తో తయారుచేయిస్తారు కాబోలు" నడి వయసు ఆడకూతురు చంకబిడ్డకు పులిహోర తినిపిస్తూ ఉసూరుమంది

'ఆ నా కొడుకులు గూడా మనలాగే చిక్కుకుంటే తెలిసేది' చినిగిన పాంటూ, షర్టువాలా శాపనార్థాలు.

మరో రోజు గడిచింది. నీటి మట్టం చాలా తగ్గిపోయింది. ఎంత మంది చనిపోయారో, ఎన్ని శవాలు కొట్టుకొచ్చాయో! శవదుర్గంధం పుక్కుపుటాల్ని చించేస్తుంధి. కడుపులో అసరా లేకున్నా డోకు వచ్చేట్టుంది. కూలిన ఇళ్లలోకి వెళ్లిన జనాలు అంగలారుస్తున్నారు. కూలిన ఇంటి అరుగు మీద కూచున్న కోటేశ్వర్రావు చూపులెటో పరుగెత్తాయి.

ఖాకీ నిక్కర్లు ధరించిన యువకులు బృందాలుగా విడిపోతు

న్నారు. విడిపోయిన వారు చకచకా పనుల్లో చేరారు.

కొందరు ఇసుకలో కూరుకుపోయిన శవాల్ని కట్టెలతో తీసి ఒక చోట చేర్చుతున్నారు. గుడ్డలు ముక్కులకు కట్టుకుని కొంద రు శవాలను కాల్చేస్తున్నారు. కూలిన గోడల మధ్యచిక్కుకున్న క్షతగాత్రుల్ని బయటకు తీస్తున్నారు కొందరు. సర్వం పోగొట్టు కుని గుండెలు బాదుకున్న వారికి ధైర్యం చెబుతున్నారు స్థైర్యం నూరిపోస్తున్నారు. వెంట తెచ్చిన ఆహార పొట్లాల నంది స్తున్నారు కొందరు. మరి కొందరు పొడి గుడ్డలందిస్తున్నారు.

ఒక యువకుడు కోటేశ్వరావు వద్ద కొచ్చి

"చూస్తే మీరు చదువుకున్న వారిలా ఉన్నారు. మీరే ఇలా దిగాలు పడి కూచుంటే ఎలాగండీ? అన్నాడు ఆహార పొట్లా మంది స్తూ. యువకుడిలో నిర్మలత్వం, నిర్మోహమ్మాటం.... అన్నింటినీ మించిన సంస్కారం కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

పొట్లాం విప్పగానే పులిహోర వాసన ఘుమఘుమ లాడింది కాసింత నోట్లో వేసుకుని

"మీ పేరేమిటండీ?" అడిగాడు–నిర్జీవంగా.

"నా పేరు రాఘవేందర్. రైల్వేలో ఉద్యోగం. మరి మీ పేరు?" మర్యాద ఉట్టిపడింది.

తన పరిచయం చెప్పి

"పులిహోర బావుందండీ, చాలా బావుంది" అన్నాడు ఉత్సాహంగా. పొట్లమై పోగానే రాఘవేందరందించిన నీరు గట గటా తాగేశాడు. ఒంట్లో సత్తువ వచ్చేసింది. సజీవంగా ఉన్నానని

రూఢైంది.

"మరింత మంది వచ్చి...." ఆశ్చర్యంగా; ఆతృతగా లేచాడు. "సేవలందిస్తున్నారు గదా! ఏ ప్రభుత్వాధికారి పంపించాడు మిమ్మల్ని?"

"ఏ ప్రభుత్వాధికారీ పంపలేదు. మాకు మేమే వచ్చాం"

"మరీ పులిహోర పొట్లాలో?" ఆశ్చర్యంతో కళ్లు అరచేతులయాయి.

"వీటిని తయారు చేసేందుకు సప్లై చేసేందుకు ప్రభుత్వమెంత సొమ్మిచ్చింది?"

"ప్రభుత్వమేమీ ఇవ్వలేదు. మేమే తలా ఇంత వేసుకుని, మరింత దాతల వద్ద సేకరించాం."

"మీకు టియ్యే, డియ్యేలెవరిస్తారు?"

'అన్నీ మా సొంత ఖర్చులే. మేము స్వయం ప్రేరితులం'

తుఫాను తదుపరి ప్రశాంతత కోటేశ్వరావు బుర్ర నలుముకుంది. అంతరాత్మ కోడైతొలి కూత కూసింది.

"మీరిలా పంజేసినందు వల్ల మీకేం లాభం?"

"తృప్తి!"

"అదెలా?"

"జన్మనిచ్చిన మాతృభూమికి, సకలసౌకర్యాలు కల్పిస్తున్న సమాజానికి మనంసదా ఋణగ్రస్తులమే. ఆ ఋణం ఎన్ని జన్మలకైనా తీరదు. అలాగని ఊరకే ఉండలేం. కష్టాల్లో ఎదురీదుతున్న సాటి మనిషికి చేయూత అందిస్తే ఎంతోతృప్తి కలుగు

తుంది. అది ... అనుభవిస్తేనే తెలుస్తుంది." ఆనందముతో ఊగిపోతున్న రాఘవేందర్ అపర శ్రీకృష్ణుడిలా తోచాడు-కోటేశ్వరావుకు. అంతరంగములో సంచలనం చెలరేగింది. ఆత్మ విమర్శ తారాస్థాయికందుకోగానే తన మీద తనకే అసహ్యమేసింది,

నరాల్లో నూతనోత్తేజం పొంగుతూంది. మొహం ఇంద్రధనుస్సులాగైంది. బోధి వృక్షం నీడలో తనను తాను తెలుసుకున్న గౌతమ బుద్ధుడిలాగుంది-అతని మానసిక పరిస్థితి.

రాఘవేందర్ చేతులందుకుని

"మీ సంస్థలో చేరాలంటే ఏ అర్హతలుండాలండీ?" అడిగాడు గద్గదికంగా.

"మనదేశ సంస్కృతికీ, చరిత్రకూ, మంచిచెడులకు వారసులమనుకునే ప్రతి మనిషీ మన సంస్థలో సభ్యుడేనండీ!

గుండె కరిగి వస్తున్న కంటిధారల్ని కోటేశ్వరావు లెక్క చెయ్యడం లేదు. మబ్బు పరదాలను ఛేదించి మహాప్రపంచంలోకొచ్చాడు దినకరుడు.